AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
26-12-2025 (Friday)
MAIN EDITION

## ప్రయాణికులకు ఇండిగో వోచర్లు



**అక్షరటుడే, ఢిల్లీ :** దేశంలో ఇటీవల ఇండిగో సంక్షోభంతో వేలాది విమానాలు రద్దయిన విషయం తెలిసిందే. ఎలాంటి సమాచారం లేకుండా విమానాలను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రయాణికులకు టికెట్ డబ్బులను రీఫండ్ చేస్తున్న సంస్థ తాజాగా ట్రావెల్ వోచర్ల పంపిణీని ప్రారంభించింది. నష్టపోయిన ప్రయాణికులకు రూ.10 వేల విలువైన వోచర్ అందించనుంది. అలాగే డీజీసీఏ మార్గదర్శకాలకు అనుగుణంగా షెడ్యూల్ చేయబడిన బయలుదేరిన 24 గంటల్లోపు విమానాలు రద్దు చేయబడిన ప్రయాణికులకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పరిహారం అందిస్తోంది.

## మార్కెట్‌ను వీడని నష్టాలు..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** ఎఫ్ఐఐల అమ్మకాలు కొనసాగుతుండడం, ముడి చమురు ధరలు పెరుగుతుండడంతో స్టాక్ మార్కెట్లు తేరుకోవడం లేదు. ప్రధాన సూచీలు వారాంతాన్ని నష్టాలతోనే ముగించాయి. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ 183 పాయింట్ల నష్టంతో ప్రారంభమై అక్కడినుంచి 153 పాయింట్లు పెరిగింది. చివరికి సెన్సెక్స్367 పాయింట్ల నష్టంతో 85,041 వద్ద, నిఫ్టీ 100 పాయింట్ల నష్టంతో 26,042 వద్ద స్థిరపడ్డాయి.

## తిరువనంతపురం మేయర్‌గా రాజేశ్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేరళలో బీజేపీ చరిత్ర సృష్టించింది. తొలిసారి తిరువనంతపురం మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల ఎన్నికల్లో 50 సీట్లు సాధించిన కాషాయ పార్టీ ఓ స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో మేయర్ పదవిని గెలుచుకుంది. ఆ పార్టీకి చెందిన వీవీ రాజేష్ మేయర్‌గా ఎన్నికయ్యారు. రాజేష్ ఇటీవల కొడుంగనూర్ వార్డు నుంచి గెలిచారు.

## 28న కాంగ్రెస్ నిరసనలు

**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గాంధీ విగ్రహాల దగ్గర ఈనెల 28న కాంగ్రెస్ పార్టీ నిరసనలు చేపట్టనుంది. ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించడంపై మరోసారి ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆదివారం గాంధీ చిత్రపటాలతో గ్రామాల్లో ఆందోళనలు చేపట్టనుంది.

## తిరుమలలో సైకో హల్‌చల్



**అక్షరటుడే, తిరుమల :** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలలో సైకో హల్‌చల్ చేశాడు. కత్తి తీసుకుని చిన్న పిల్లల వెంటపడుతూ చంపేస్తానని కత్తితో బెదిరింపులకు పాల్పడ్డాడు. అతడిని ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తిరుమల వన్ టౌన్‌కు తరలించారు. సదరు వ్యక్తిని పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వాడిగా గుర్తించారు.



## ముగిసిన ప్రభాకర్ రావు విచారణ

**అక్షరటుడే, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు విచారణ ముగిసింది. ఆయన కస్టడీ ముగియడంతో పోలీసులు విడుదల చేశారు. ప్రభాకర్‌రావును పోలీసులు 14 రోజులు కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. సిట్ అధికారులు ఆయన నుంచి కీలక విషయాలు రాబట్టారు. రిటైర్మెంట్ తర్వాత ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్ రావుని మళ్ళీ నియమించడంపై సిట్ ప్రశ్నించింది. ప్రభాకర్‌రావు విచారణ నివేదికను జనవరి 16న సుప్రీం కోర్టుకు సిట్ అధికారులు నివేదించనున్నారు.




## పానీపూరి అమ్ముకునే వ్యక్తి బిడ్డకు అందాల కిరీటం

**అక్షరటుడే, భద్రాచలం :** భద్రాచలం అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన ప్రీతి యాదవ్ జాతీయ స్థాయి అందాల పోటీలో ప్రతిభ చాటి 'మిస్ టీన్ తెలంగాణ' కిరీటాన్ని సొంతం చేసుకుంది. డిసెంబర్ 19 నుంచి 21 వరకు జైపూర్ వేదికగా నిర్వహించిన 'మిస్ టీన్ ఫరెవర్ - ఫరెవర్ స్టార్ ఇండియా సీజన్5' పోటీల్లో ఆమె ఈ ఘనత సాధించింది. ఆమె తల్లిదండ్రులు ఉదయ్ ప్రకాశ్ యాదవ్ - రేణు దంపతులు. వీరి స్వస్థలం ఉత్తరప్రదేశ్. ఉపాధి నిమిత్తం సుమారు 20 ఏళ్ల క్రితం భద్రాచలానికి వచ్చి స్థిరపడ్డారు. ప్రీతి తండ్రి ప్రస్తుతం పానీపూరి బండి నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు జల మండలి అధికారులు ప్రకటన విడుదల చేశారు. కృష్ణా ఫేజ్ 1 లోని పైప్‌లైన్, వాల్వ్‌లకు సిబ్బంది మరమ్మతులు చేయనున్నారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుంది. ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

**అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడానికి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని తీసుకొచ్చింది. అయితే ప్రస్తుతం యాసంగి సాగు పనులు ప్రారంభం అయ్యాయి. అయినా రైతు భరోసా విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేదు. శాటిలైట్ సర్వే చేసి సాగు భూములకు మాత్రమే ఇస్తామని మంత్రి ప్రకటించారు. అయితే దానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ఈ సీజన్‌లో రైతు భరోసా ఇస్తారా.. లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్**



# రైతు భరోసా కోసం నిరీక్షణ

- ప్రారంభమైన యాసంగి పనులు
- ఇప్పటికీ పెట్టుబడి సాయం విడుదల చేయని ప్రభుత్వం
- సాగు భూములకే ఇస్తామని మంత్రి ప్రకటన
- ఎప్పుడిస్తారోనని రైతుల ఆందోళన

రాష్ట్రంలో యాసంగి సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. పలు జిల్లాల్లో వరి నాట్లు ప్రారంభం అయ్యాయి. అయితే ఇప్పటికీ రైతు భరోసా విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ఎకరాకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బీఆర్ఎస్ హయాంలో తొలుత ఎకరానికి రూ.4 వేలు రైతు బంధు ఇచ్చేవారు. అనంతరం రూ.5 వేలకు పెంచారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తొలి సీజన్‌లో రైతు బంధు రూ.5 వేల చొప్పున జమ చేసింది. తర్వాత సీజన్‌కు రైతు భరోసా జమ చేయలేదు. గత యాసంగి సీజన్‌లో రైతు భరోసాను ఎకరాకు రూ.6 వేలకు పెంచింది. అది కూడా నాలుగు ఎకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే విడుదల చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు రైతు భరోసా విడుదలపై ప్రకటన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### రూ.9 వేల కోట్లు అవసరం

రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం సీజన్‌లో తొమ్మిది రోజుల్లో రైతు భరోసా జమ చేసింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గత సీజన్‌లో మాత్రమే వేగంగా పెట్టుబడి సాయం అందింది. అందరు రైతులకు నిధులు విడుదల అయ్యాయి. రూ.9 వేల కోట్లను తొమ్మిది రోజుల్లో అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. అయితే ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు నిధులపై ప్రకటన చేయడం లేదు. అందరు రైతులకు విడుదల చేయాలంటే రూ.9 వేల కోట్లు అవసరం. అయితే ఇందులో కోత పెట్టడానికి ప్రభుత్వం చూస్తున్నట్లు తెలుస్తోంది.

### సాగు భూములకే..

రాష్ట్రవ్యాప్తంగా పంటలు సాగు చేస్తున్న భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. దీంతో నిధుల భారం తగ్గించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అర్థమవుతోంది. అయితే సాగు భూములను శాటిలైట్ మ్యాపింగ్ గుర్తించి రైతు భరోసా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## కేసీఆర్ యాక్టివ్.. గులాబీ శ్రేణుల్లో జోష్



**అక్షరటుడే, హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. పార్టీ బలోపేతంపై ఆయన దృష్టి పెట్టారు. దీంతో బీఆర్ఎస్‌లో జోష్ నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేసీఆర్ రాజకీయాల్లో అంత యాక్టివ్‌గా లేరు. ఫామ్‌హౌజ్‌కే పరిమితం అయ్యారు. ఒకటి రెండు సార్లు అసెంబ్లీకి వచ్చినా.. మాట్లాడలేదు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మాత్రమే ఆయన మాట్లాడారు. అయితే కేసీఆర్ యాక్టివ్‌గా లేకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నిస్తేజం అలుముకుంది. అయితే ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ స్థానాల్లో గెలిచినా.. బీఆర్ఎస్ గట్టి పోటినిచ్చింది. దీంతో రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఇందులో భాగంగా పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టారు. ఇటీవల బీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ శుక్రవారం మధ్యాహ్నం ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు.

## రేవంత్‌రెడ్డి కరిచేలా ఉన్నారు : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఆయనను కట్టేయాలని సీఎం భార్య గీతమ్మను కోరుతున్నట్లు చెప్పారు. లేదంటే రోజు అరిచి అరిచి పిచ్చిలేసి ఎవరినైనా కరిచే లాగా ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాష్ట్రంలో కూల్చివేతలు, పేల్చివేతలు, ఎగవేతలు మాత్రమే చేస్తుందన్నారు. హైడ్రా పేరిట హైదరాబాద్ నగరంలోని పేదల ఇళ్లను కూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు రెండు మూడు చెక్ డ్యాములు పేల్చి ఇసుక అమ్ముకుంటున్నారని విమర్శించారు.

## ఆర్టీసీలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ట్రాఫిక్ సూపర్ వైజర్ ట్రెయినీ, మెకానికాల్ సూపర్‌వైజర్ ట్రెయినీ పోస్టులను భర్తీ చేయనుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులు 84 పోస్టులు, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టుల 114 భర్తీ చేయనున్నారు. వీటి కోసం ఈ నెల 30న ఉదయం 8 గంటల నుంచి జనవరి 20 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

## జీమెయిల్ ఐడీ మార్చుకునే అవకాశం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** జీమెయిల్ వినియోగదారులకు గూగుల్ శుభవార్త చెప్పింది. జీమెయిల్ యూజర్ ఐడీ మార్చుకునే అవకాశం కల్పించింది. అయితే ప్రస్తుతం ఈ ఫీచర్ అందరికీ అందుబాటులోకి రాలేదు. కొంతమంది యూజర్లకు మాత్రమే ఈ ఆప్షన్ కనిపిస్తున్నట్లు సమాచారం. పూర్తి స్థాయిలో అన్ని ఖాతాలకు ఈ సౌకర్యం రావడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## అనుమానంతో భార్య హత్య

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని నల్లకుంటలో దారుణం చోటు చేసకుంది. అనుమానంతో ఓ వ్యక్తి భార్యను హత్య చేశాడు. నల్గొండ జిల్లా హుజురాబాద్‌కు చెందిన వెంకటేష్, త్రివేణి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ దంపతులు బతుకుదెరువు కోసం నగరంలోని నల్లకుంటలో నివాసం ఉంటున్నారు. వెంకటేష్ తన భార్యను తరచూ అనుమానించేవాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో త్రివేణి భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. వెంకటేశ్ అత్తారింటికి వెళ్లి తాను మారానని చెప్పాడు. భార్యను బాగా చూసుకుంటానని నమ్మించాడు. దీంతో అతడి మాటలు నమ్మి ఆమె భర్త వెంట హైదరాబాద్ వచ్చింది. నగరానికి వచ్చిన తర్వాత వెంకటేష్ మళ్లీ గొడవ పడడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఆమెతో గొడవ పడి దాడి చేశాడు. అనంతరం పెట్రోల్ పోసి నిప్పటించాడు. అడ్డుకోబోయిన కూతురిని సైతం మంటల్లోకి తోసేసి పారిపోయాడు. స్థానికులు గమనించి తల్లీకూతుళ్లను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే త్రివేణి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు నిందితుడు వెంకటేష్‌ను అరెస్ట్ చేశారు.

## హీరోయిన్ కొత్త అవతారం..



హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న షగ్న శ్రీ వేణున్ దర్శకురాలిగా మారారు. షగ్న శ్రీ 'ప్రభుత్వ జూనియర్ కళాశాల' సినిమా ద్వారా మంచి గుర్తింపు లభించింది. ఆ చిత్రంలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నటిగా కొనసాగుతూనే ఫ్యాషన్ డిజైనర్‌గా, వ్యాపార రంగంలోనూ చురుగ్గా వ్యవహరిస్తూ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే షగ్న, ఇప్పుడు దర్శకత్వ రంగంలోకి అడుగుపెట్టడం గమనార్హం. వరుణ్ సందేశ్ హీరోగా ఎస్ 2 ఎస్ సినిమాస్ బ్యానర్‌పై ఆమె చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటించనున్నారని సమాచారం.

- అక్షరటుడే, సినిమా డెస్క్